సంక్షేమం, అభివృద్ధిపై చర్చకు రండి

- ఏ ఒక్కరి పింఛను తొలగించలేదు
- ప్రతిపక్షాల దుష్ప్రచారం మానుకోవాలి
- దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి


పెదపాడులో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

పెదపాడు: అర్హులందరికీ పింఛన్లు అందిస్తుంటే టీడీపీ నాయకులు, ఎల్లో మీడియా పింఛన్లు తొలగిస్తున్నారంటూ గగ్గోలు పెడుతున్నారని దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. గతంలో కంటే ప్రస్తుతం పెదపాడు మండలంలో 1,600 పింఛన్లు అధికంగా అందిస్తున్నామన్నామన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రతిపక్షాలు చర్చకు రావాలని ఆయన సవాల్ చేశారు. చంద్రబాబు కాలం చెల్లిన నాయకుడని, ఎల్లో మీడియా ఆయనను జాకీలు పెట్టి లేపాలనుకున్నా ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. మాజీ ఎమ్మెల్యే ఇటీవల ప్రభుత్వ కార్యాలయంలోకి అనుమతి లేకుండా చొరబడి పోలీసులతో తగాదా పెట్టుకుని, తానే చొక్కా చింపుకుని పోలీసులపై ఆరోపణలు చేయడాన్ని అందరూ గమనించారన్నారు. చింతమనేని చిల్లర చేష్టలను ప్రజలందరూ గమనిస్తున్నారని చెప్పారు. దమ్ముంటే ఎక్కడైనా అభివృద్ధి, సంక్షేమ పథకాలపై చర్చకు సిద్ధమని టీడీపీ నాయకులకు సవాల్ విసిరారు. వలంటీర్లు ఇంటికే వెళ్లి లబ్ధిదారులకు పింఛన్లు అందిస్తున్నారని అన్నారు. ప్రతి గ్రామంలో శాఖల వారీగా అధికారులను నియమించి, ప్రతి 50 కుటుంబాలకు ఒక వలంటీరును నియమించి ప్రభుత్వ సేవలను ప్రజలకు చేరువ చేసిన ఘనత సీఎం జగన్‌కు దక్కిందన్నారు. ప్రతి సచివాలయంలో కన్వీనర్లను ఏర్పాటు చేసామన్నారు. ప్రజలకు సక్రమంగా పథకాలు అందుతున్నాయా లేదా అని చూసేందుకు సచివాలయ కన్వీనర్లను నియమించామన్నారు. వలంటీర్లతో పాటు 50 కుటుంబాలకు 2 గృహసారథులను ఏర్పాటు చేస్తామన్నారు. అర్హులందరికీ పథకాలు సక్రమంగా అందించాలనే లక్ష్యంతో కృషి చేస్తున్నామన్నారు. ప్రతి సచివాలయంలోని సిబ్బంది, వలంటీర్లు, గృహ సారథులు కన్వీనర్లతో సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. ఫిబ్రవరి నుంచి ఈకార్యక్రమం చేపడతామన్నారు. ఈ సందర్భంగా సచివాలయ కన్వీనర్లకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. పెదపాడు మండలంలో 129 ఎకరాలు కొనుగోలు చేసి ఇళ్ల స్థలాలు కేటాయించినట్టు ఎమ్మెల్యే అబ్బాయిచౌదరి అన్నారు. మండలంలో 9,600 మందికి వివిధ పింఛన్లు అందిస్తున్నామని చెప్పారు. సంక్షేమ పాలన కొనసాగేందుకు ప్రజలంతా వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. పెదపాడు ఎంపీపీ బత్తుల రత్నకుమారి, జిల్లా రైతువిభాగం అధ్యక్షుడు ఆళ్ల సతీష్ చౌదరి, పెదపాడు సొసైటీ అధ్యక్షుడు అక్కినేని రాజశేఖర్, వైస్ ఎంపీపీ రెడ్డి స్వర్ణకుమారి తోటగూడెం ఎంపీటీసీ అక్కినేని గోపీ చంద్రదుర్గాప్రసాద్, రాష్ట్ర హస్తకళల కార్పొరేషన్ డైరక్టరు ముదుగురు సూర్యనారాయణ, వడ్డీ కార్పొరేషన్ డైరక్టరు ఘంటసాల ప్రభాకరరావు, డిజిజన్ మోనటరింగ్ కమిటీ సభ్యుడు కత్తుల రవికుమార్, సర్పంచ్‌లు కొత్తూరు జీవనకుమారి, వక్రపు కృష్ణ తులసి కోటిరెడ్డి, కడిమి పద్మావతి, ఏనుగ అబ్రహం, కోట లలితకుమారి, గుజ్జుల రత్నకుమారి, సిద్ధాబత్తిన జోజమ్మ, మరీదు రెడ్డియ్య, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

విజయమే లక్ష్యంగా పని చేయాలి


భీమడోలులో సచివాలయ కన్వీనర్లు, వలంటీర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాసుబాబు

భీమడోలు: 2024 ఎన్నికలలో విజయమే లక్ష్యంగా, వైఎస్సార్ సీపీ పటిష్టతకు సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు సైనికుల్లా పని చేయాలని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. భీమడోలు సంత మార్కెట్ అమ్మవార్ల ఆలయాల వద్ద శనివారం మండలస్థాయిలో గ్రామ సచివాలయ కన్వీనర్లు, వలంటీర్ల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మండల వైసీపీ కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు పలు అంశాలపై దిశానిర్దేశం చేసారు. వాసుబాబు మాట్లాడుతూ సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రాగానే దేశ చరిత్రలోనే మునుపెన్నడూ లేని విధంగా సంక్షేమ పథకాలు అమలు చేసారని తెలిపారు. వాటిని ఇతర రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకున్నాయన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని హామీలను సైతం అమలు చేసి నిరుపేద కుటుంబాలకు సీఎం జగన్ ఆర్థిక భరోసా కల్పించారన్నారు. లబ్ధిదారుల ఎంపిక బాధ్యతను వలంటీర్లకు అప్పగించారన్నారు. ఈ మూడేళ్ల కాలంలో పథకాల ద్వారా రూ.1.6లక్షల కోట్లు లబ్ధిదారులకు అందించారన్నారు. ఆ సొమ్ములను అర్హులకు అందించామన్న సంతృప్తి వలంటీర్లకు ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్ సీపీకి విజయం అందించాల్సిన బాధ్యత మనందరి ఉందన్నారు. పథకాలను అమలు చేసే విషయంలో కన్వీనర్లు, వలంటీర్లు భాగస్వామ్యులు కావాలన్నారు. కన్వీనర్లు, వలంటీర్లు సమన్వయంతో పని చేయాలని కోరారు. మండల కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో వైసీపీ విజయఢంకా మోగించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కనమాల రామయ్య, జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ రంగ, ఎఎంసీ చైర్మన్ ఇంజేటి నీలిమజూనియర్, మండల సర్పంచులు ఛాంబర్ అధ్యక్షురాలు పాము సునీతా మాన్‌సింగ్, రాష్ట్ర కార్యదర్శి ఎం.జాన్సన్, జిల్లా చేనేత విభాగం వైసీపీ అధ్యక్షుడు గోలి సుబ్బారావు, సర్పంచులు దాయం సుజాత ప్రసాద్, షేక్ రహీమాబేగం హసేనా, జల్లూరి వెంకట నర్సమ్మ, గుడివాడ నాగగౌతమి సీతారామాంజనేయులు, మండల ప్రధాన కార్యదర్శి రామకుర్తి నాగేశ్వరరావు, ఎంపీటీసీలు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్రంలో అవినీతి రహితపాలన

భీమడోలు: అవినీతి రహిత పాలనను అందిస్తూ దేశంలోనే ఆదర్శవంతమైన రాష్ట్రంగా తీర్చిదిద్దిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల గుండెల్లో చిరగని ముద్ర వేసుకున్నారని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. భీమడోలు సంతమార్కెట్‌లో అమ్మవార్ల ఆలయాల వద్ద శనివారం వైఎస్సార్ పింఛన్ భరోసా పథకంలో భాగంగా మండలంలో నూతనంగా మంజూరైన 328 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్ పాము సునీతామాన్‌సింగ్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా కుల, మత, రాజకీయాలకతీతంగా ప్రభుత్వ పథకాలు అమలు చేస్తున్న ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. నేడు అర్హులైన వారి ఇంటింటికీ వెళ్లి పథకాలు అందిస్తున్నామన్నారు. భీమడోలు మండలంలో ప్రతి నెల రూ.2.39కోట్ల పింఛన్ల నగదు అందిస్తుండగా కొత్త పింఛన్ మంజూరులో ప్రతి నెల రూ.2.48 కోట్ల నగదు అందిస్తున్నామని తెలిపారు. చక్కని పాలనను అందిస్తున్న సీఎం జగనన్నకు ప్రజలంతా చల్లని దీవెనలు అందించాలని కోరారు. అనంతరం మండలంలోని 13 గ్రామ పంచాయతీల పరిధిలో మంజూరైన వృద్ధాప్య, వితంతు, ఒంటరి, దీర్ఘకాలిక రోగులు, వికలాంగులు, కులవృత్తిదారులు 328 మందికి పింఛన్లు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కనమాల రామయ్య, జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ రంగా, ఎఎంసీ చైర్మన్ ఇంజేటి నీలిమజూనియర్, మండల సర్పంచుల ఛాంబర్ అధ్యక్షురాలు పాము సునీతామాన్‌సింగ్, మండల వైసీపీ కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్, జిల్లా సాగు సలహా మండలి చైర్మన్ వెంకటేశ్వరరావు, ఎంపీడీవో జీఎల్ఎన్‌వీ రాఘవన్, తహసీల్దార్ షంషూద్దీన్, రాష్ట్ర కార్యదర్శి ముళ్లగిరి జాన్సన్, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రక్తహీనత రహిత సమాజ స్థాపనకు కృషి


పోలసానిపల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా కోఆర్డినేటర్ టీఎస్ స్నేహన్

భీమడోలు: రక్తహీనత రహిత సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని జిల్లా సచివాలయాల శాఖ సామాజిక ప్రవర్తనా మార్పు సమాచార విభాగం కోఆర్డినేటర్ టీఎస్ స్నేహన్ అన్నారు. భీమడోలు వైఎస్సార్ క్రాంతి పథం, డీఆర్‌డీఏ, సచివాలయాల సామాజిక ప్రవర్తనా మార్పు విభాగాల సంయుక్తంగా శనివారం అంగన్‌వాడీ కేంద్రాలు, సచివాలయాలల్లో రక్త హీనతపై మహిళలు, బాలికలకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. వైఎస్సార్ హెల్త్ క్లినిక్ ద్వారా అందుతున్న వైద్య సేవలపై ఆయన సిబ్బంది, తల్లుల నుంచి వివరాలు సేకరించారు. పోలసానిపల్లి, భీమడోలులోని అంగన్‌వాడీ కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించారు. పోలసానిపల్లి సచివాలయం వద్ద సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. పోలసానిపల్లి కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన ఆయన అక్కడ ఎక్కువ మంది చిన్నారులు హాజరు కావడంపై సంతృప్తి వ్యక్తం చేసారు. అంగన్‌వాడీ కార్యకర్త కేపీవీ అంజలిని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయాల్లో బాలల కోసం ప్రత్యేక రిజిస్టర్ ఏర్పాటు చేసి బాలలందరి వివరాలను నమోదు చేయాలన్నారు. ఎంపీడీవో జీఎల్ఎన్ రాఘవన్ గుండుగొలనులోని అంగన్‌వాడీ కేంద్రాలను ఆకస్మిక తనిఖీలు చేసి రికార్డులను పరిశీలించారు. సంబంధిత సిబ్బంది తగు సూచనలందించారు. ఈ కార్యక్రమాల్లో ఏపీఎం పి.సురేష్‌కుమార్, క్లస్టర్ కోఆర్డినేటర్ సీత, ఎంఎల్‌హెచ్‌పీ రాణికుమారి, వీఆర్వో డి.సింహాచలం, వెల్ఫేర్ అసిస్టెంట్ రమేష్, సచివాలయ ఉద్యోగులు, అంగన్‌వాడీ సిబ్బంది ఏఎన్ఎం, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

కోడిపందేలు ఆడినా, ప్రోత్సహించినా కఠిన చర్యలు


ఎ.గోకవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న తహసీల్దారు వెంకటరమణ తదితరులు

ఉంగుటూరు: కోడిపందేలు ఆడినా, ప్రోత్సహించిన చట్టారీత్యా చర్యలు తీసుకుంటామని తహసీల్దారు వెంకటరమణ స్పష్టం చేశారు. శనివారం ఉంగుటూరు మండలం ఎ.గోకవరం, చేబ్రోలులో కోడి పందేలు ఆడవద్దని ప్రజలను చైతన్యపరుస్తూ సమావేశాలు నిర్వహించారు. ఈ సమావేశాలలో వెంకటరమణ మాట్లాడుతూ పేకాట, కోడిపందేలు ఆడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. జూదాలకు స్థలం ఇచ్చినవారిపై కేసు నమోదు చేస్తామన్నారు. ఆయా గ్రామాల్లో కోడిపందేలకు వ్యతిరేకంగా ర్యాలీలు నిర్వహించారు. మండల ప్రత్యేక అధికారి గుండవరపు రమణ, గణపవరం సీఐ సుభాష్, ఎస్సై స్వామి, ఆయాగ్రామాల సర్పంచులు మిద్దే సత్యవతి, రందే లక్ష్మీసునీత, ఎంపీటీసీ సభ్యులు దేవదాసు విజయనిర్మల ధర్మరాజు, ఇన్‌చార్జి ఎంపీడీ ఆంజేయ బాబు పాల్గొన్నారు. ఆయాగ్రామాల సచివాలయాల సిబ్బంది, పాల్గొన్నారు.

గణపవరంలో కోడికత్తులు స్వాధీనం


గణపవరంలో పోలీసులు స్వాధీనం చేసుకున్న కోడికత్తులు

గణపవరం: గణపవరం సర్కిల్ పరిధిలో పోలీసులు భారీగా కోడికత్తులు స్వాధీనం చేసుకుని బాధ్యులపై కేసులు నమోదు చేశారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు గణపవరం సీఐ ఎంవీ సుభాష్ ఆధ్వర్యంలో ఎస్సై వెంకటేశ్వరరావు సిబ్బందితో కలిసి సర్కిల్ పరిధిలోని గ్రామాల్లో కోడికత్తులు తయారీ దారులపై దాడులు నిర్వహించారు. ఈదాడుల్లో 644 కోడికత్తులు స్వాధీనం చేసుకుని 307మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు సీఐ సుభాష్ తెలిపారు. గణపవరం ఇందిరమ్మకాలనీకి చెందిన ముసునాని శివాజి ఇంటిపై దాడిచేసి 502 కత్తులు, కత్తులకు పదునుపెట్టే ఎలక్ట్రానిక్ మెషీన్‌లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఉంగుటూరు మండలం ఎర్రమల్లిపాడుకు చెందిన చింతలపూడి నాగేశ్వరావు ఇంటిపై దాడిచేసి 103 కోడి కత్తులు, నిడమర్రు మండలంలో 49 కోడికత్తులు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ సంక్రాంతి సందర్భంగా గ్రామాల్లో కోడిపందేలు, ఇతర జూదాలను అరికట్టేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నామని అన్నారు. పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో సంప్రదాయ క్రీడలైన కబడ్డీ, క్రికెట్, వాలీబాల్ తదితర పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. గణపవరం, నిడమర్రు, చేబ్రోలు ఎస్సైలు వెంకటేశ్వరావు, గుర్రయ్య, స్వామి పాల్గొన్నారు.

గర్భిణులకు హెచ్ఐవీ పరీక్షలు చేయాలి


గణపవరం పీహెచ్‌సీలో రక్తనమూనాలను పరిశీలిస్తున్న ఎయిమ్స్ భువనేశ్వర్ డైరక్టర్

గణపవరం: గర్భిణులకు హెచ్ఐవీ పరీక్షలు చేయాలని ఎయిమ్స్ భువనేశ్వర్ డైరక్టర్ సుభాకాంత్‌సాహూ అన్నారు. శనివారం ఆయన గణపవరం పీహెచ్‌సీని సందర్శించి గర్భిణుల నుంచి రక్తనమూనాలు స్వీకరించే విధానాలను పరిశీలించారు. గర్భిణులకు రక్త పరీక్షలు చేయడంపై డిసెంబర్ 29, 30 తేదీల్లో రెండు రోజుల పాటు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి గణపవరం పీహెచ్‌సీ వైద్యాధికారులు సంతోష్‌నాయుడు, కిరణ్మయి హాజరయ్యారు. వీరు గర్భిణుల నుంచి రక్త నమూనాలు సేకరించే విధానంపై శిక్షణ పొందారు. శనివారం పీహెచ్‌సీని సందర్శించిన సుభాకాంత్‌సాహూ గర్భిణుల నుంచి రక్తం సేకరించే విధానాన్ని చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ నమూనాలను భువనేశ్వర్ ఎయిమ్స్‌కు పంపుతామన్నారు. ఈ కార్యక్రమంలో టెక్నీషియన్ శ్రీనివాసరావు, స్టాఫ్‌నర్స్ కె.ఎం మేరీ సుహాసిని పాల్గొన్నారు.

పోతునూరులో పేకాట స్థావరాలపై దాడి

దెందులూరు: జిల్లా అదనపు ఎస్పీ, ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ ఆదేశాల మేరకు శుక్రవారం రాత్రి పోతునూరులో పేకాట స్థావరాలపై సెబ్ పోలీసులు దాడి చేశారు. ముగ్గురిని అదుపులోకి తీసుకుని, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. రూ.19,870 నగదు సీజ్ చేసినట్టు దెందులూరు ఎస్సై వీర్రాజు తెలిపారు.

20 మంది బైండోవర్

దెందులూరు: కోడిపందేలు, పేకాట వంటి జూదాలను అరికట్టేందుకు ముందస్తుగా దెందులూరు ఎస్సై ఐ.వీర్రాజు ఆదేశాల మేరకు పలువురిని బైండోవర్ చేస్తున్నట్టు హెడ్‌కానిస్టేబుల్ రాము అన్నారు. శనివారం దెందులూరు తహసీల్దార్ కోర్టులో 20 మందిని ముందస్తుగా తహసీల్దార్ ఎన్‌వీ నాంచారయ్య సమక్షంలో బైండోవర్ చేశారు. తహసీల్దార్‌కు పూచీకత్తులు ఇవ్వడంతో వారికి సూచనలు ఇచ్చి పంపించినట్టు ఎస్సై తెలిపారు.

దోమలతోనే వ్యాధుల వ్యాప్తి


నీటితొట్టిలో దోమల వృద్ధిపై అవగాహన కల్పిస్తున్న మలేరియా అధికారి సిబ్బంది

గణపవరం: అన్ని వ్యాధులకు మూలం దోమలేనని, వాటి నివారణతో వ్యాధులకు దూరంగా, ఆరోగ్యవంతమైన జీవనం సాగించవచ్చునని తాడేపల్లిగూడెం డివిజన్ మలేరియా అధికారి వైవీ లక్ష్మణరావు అన్నారు. శనివారం ఆయన వైద్యసిబ్బందితో కలిసి గణపవరం మండలం కాశిపాడులో దోమల వ్యాప్తి, నివారణ, దోమలనుంచి రక్షణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఇంటింటికీ తిరిగి అపరిశుభ్రత, దోమల వ్యాప్తి, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. నిల్వ నీటిలో ఎక్కువగా దోమలు వృద్ధి చెందుతాయన్నారు. ప్రస్తుత సీజన్‌లో డెంగీ, టైఫాయిడ్, మలేరియా వంటి వ్యాధులు ఎక్కువగా ఉన్నందున ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉంటూ పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సహాయకుడు నామాలరాజు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

దాడి కేసులో వ్యక్తికి రిమాండ్

భీమడోలు: గుండుగొలను గ్రామానికి చెందిన నిందితుడు గొల్లా భూషణం అదే గ్రామానికి చెందిన గుణ్ణం విజయరాజును మద్యానికి డబ్బులు ఇవ్వమని డిమాండ్ చేస్తూ తీవ్రంగా కొట్టాడు. గాయపడిన బాధితుడు విజయరాజు ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. వివరాల్లోకి వెళ్లితే... గుండుగొలనుకు చెందిన గుణ్ణం విజయరాజు ఈనెల 3వ తేదీ కూలి పని సొమ్ము లెక్కిస్తుండగా అక్కడే ఉన్న గొల్లా భూషణం అంబేడ్కర్ సెంటర్లో అతన్ని అడ్డగించి మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేసాడు. విజయరాజు ఇవ్వనని చెప్పడంతో కోపగించుకున్న భూషణం అతన్ని విచక్షణా రహితంగా కొట్టాడు. గొల్ల భూషణం గతంలో కూడా ఇదే తరహా నేరాలకు పాల్పడి జైలుకు వెళ్లాడు. హెడ్ కానిస్టేబుల్ రామచంద్రం నింతుడిని అదుపులోకి తీసుకుని భీమడోలు కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించినట్లు ఎస్సై చావా సురేష్‌కుమార్ తెలిపారు.

వంద రోజుల పండుగకు తరలిన వైఎస్సార్ సీపీ శ్రేణులు

దెందులూరు: ఏలూరు రూరల్ మండలం మాదేపల్లిలో శనివారం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం వందరోజుల కార్యక్రమానికి దెందులూరు మండలం వైఎస్సార్‌సీపీ నాయకులు తరలివెళ్లారు. వైఎస్సార్‌సీపీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని, జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం గంగరాజు, ఎంపీపీ బొమ్మనబోయిన సుమలత ఆధ్వర్యంలో మండలంలోని 17 పంచాయతీల నుంచి ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, సొసైటీ త్రిమెన్ కమిటీ సభ్యులు, పార్టీ కార్యకర్తలు మాదేపల్లి తరలివెళ్లారు.

శ్రీవారి పథకాలకు రూ.2 లక్షల విరాళం

ద్వారకాతిరుమల : శ్రీవారి పథకాలకు ఇద్దరు భక్తులు వేర్వేరుగా శనివారం రూ.2,00,232 విరాళంగా అందజేశారు. తాడేపల్లిగూడెంకు చెందిన ద్వారకాతిరుమల గార్లిక్ యజమాని నిత్యాన్నదాన పథకానికి ఎం.గంగరాజు పేరున రూ.1,00,116, హైదరాబాద్‌కు చెందిన ఇంకొల్లు సాయి వీణాధారి గోసంరక్షణ పథకానికి రూ.1,00,116 ఏఈఓ ఆర్.లక్ష్మణస్వామికి అందజేశారు.

క్లుప్తంగా

నేడు బువ్వనపల్లిలో 'గడపగడపకు'

నిడమర్రు: క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు నిర్వహిస్తున్న గడపగడపకు మన ప్రభుత్వం బువ్వనపల్లిలో ఆదివారం 2వ రోజు ఉదయం 8.30 గంటల నుంచి కొనసాగుతుందని వైసీపీ మండల కన్వీనర్ సంకు సత్యకుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు పాల్గొని గ్రామంలో ఆయా కుటుంబాలకు ప్రభుత్వ పరంగా అందిన ఆర్థిక లబ్ధి వివరించి, వారి సమస్యలు తెలుసుకుంటారన్నారు. ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో వైసీపీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.

నేడు జగనన్న కాలనీలో విద్యుత్ లైన్లు, పబ్లిక్ ట్యాప్‌లు ప్రారంభం

బువ్వనపల్లిలోని జగనన్న కాలనీ (వాసుబాబు నగర్)లో మౌలిక వసుతల కల్పనలో భాగంగా నూతన విద్యుత్ లైన్లు, నీటి సరఫరాలో భాగంగా పబ్లిక్ కుళాయిలను ఆదివారం ఉదయం 8 గంటలకు ఎమ్మెల్యే వాసుబాబు ప్రారంభిస్తారని వైసీపీ మండల కన్వీనర్ సంకు సత్యకుమార్ తెలిపారు.

పరీక్షలు కట్టుదిట్టంగా నిర్వహించాలి


పిప్పరలో హైస్కూల్లో ఎస్ఏ-1 పరీక్షను తనిఖీ చేస్తున్న ఎంఈవో శేషు

గణపవరం: ఎస్ఏ-1 పరీక్షలను పకడ్బందీగా ఎలాంటి అవకతవకలు, కాపీయింగ్ లేకుండా నిర్వహించాలని గణపవరం ఎంఈవో పుచ్చల శేషు అన్నారు. శనివారం ఆయన పిప్పర, గణపవరంలలో ఎస్ఏ-1 పరీక్షలు నిర్వహిస్తున్న కేంద్రాలను సందర్శించి పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించారు. ప్రభుత్వం పరీక్షల నిర్వహణకు ఇచ్చిన మార్గదర్శకాలకు అనుగుణంగా పరీక్షలను నిర్వహించాలన్నారు. పరీక్షా పత్రాలను పరీక్షకు పదిహేను నిమిషాల ముందు మాత్రమే పేపర్లు తీయాలన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో భోజనం తనిఖీ


చల్లచింతలపూడిలో అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న తహసీల్దార్ నాంచారయ్య

దెందులూరు: కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారాన్ని తహసీల్దార్ ఎన్‌వీ నాంచారయ్య శనివారం తనిఖీ చేశారు. చిన్నారులను పౌష్టికాహారం, గుడ్లు పంపిణీపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పరిశుభ్రత, పౌష్టికాహారం, అంగన్‌వాడీ కేంద్రం 127లో నిర్వహణ పట్ల తహసీల్దార్ సంతృప్తి వ్యక్తం చేశారు. సర్పంచ్ బైగాని వెంకటేశ్వరమ్మ శ్రీమన్నారాయణ, వీఆర్ఓ సూర్యచంద్రరావు ఉన్నారు.

హైస్కూలు అభివృద్ధికి పూర్వ విద్యార్థుల విరాళం

ఉంగుటూరు: బాదంపూడి హైస్కూలు అభివృద్ధికి 1986-87 పదోతరగతి బ్యాచ్ విద్యార్థులు రూ.60 వేలు విరాళం అందజేశారు. పాఠశాల హెచ్ఎం భాస్కరరావుకు శనివారం పూర్వవిద్యార్థులు విరాళం అందజేశారు. టిస్ట్ బ్యాచ్ తరుపున అల్లు శ్రీను, కప్పల శ్రీను రాంబాబు మాస్టారు పాల్గొన్నారు.

పాఠశాలల్లో నాణ్యమైన బోధన అందించాలి

పెదపాడు: పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన బోధనతో పాటు నాణ్యమైన ఆహార పదార్థాలను అందించాలని పెదపాడు ఎంపీడీవో ఎస్ నిర్మలజ్యోతి తెలిపారు. పెదపాడు మండలంలోని నాయుగూడెంలోని ప్రాథమిక పాఠశాలలో నీటి వసతి, విద్యుత్ సౌకర్యాలతోపాటు బియ్యం చిక్కీలు, గుడ్లు ఎంత మేర ఉన్నాయో స్టాక్‌ను రికార్డులను తనిఖీ చేసారు. ఆహార పదార్థాలు నాణ్యతను పరిశీలించారు. వాటర్ ప్లాంట్ చెడిపోవడంతో వెంటనే బాగు చేయించాలని ఉపాధ్యాయుడు జయప్రకాష్‌ను ఆదేశించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రం పరిశీలించారు. విద్యార్థులతో పలు అంశాలపై మాట్లాడారు. ఈకార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ధర్మగోవిందు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా రూ.2 లక్షలు అందజేత

ఏలూరు రూరల్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ బీమా పథకం ద్వారా పేద కుటుంబాలను ఆదుకుంటున్నారని కార్పొరేటర్ తంగెళ్ల రాము కొనియాడారు. శనివారం 15 డివిజన్‌లో వైఎస్సార్ బీమా పథకం చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇటీవల మృతి చెందిన కొండూరు గంగాధర్‌రావు, దిమ్మెట బాలాజీ కుటుంబ సభ్యులకు ప్రభుత్వం వైఎస్సార్ బీమా పథకం ద్వారా రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయం అందజేసినట్లు చెప్పారు వైఎస్సార్ బీమా పేదలకు ఎంతో దన్నుగా నిలిచిందన్నారు.

సీతారామస్వామి ఆలయంలో శాంతి కల్యాణోత్సవం


గుండుగొలనులో స్వామి, అమ్మవార్లకు తలంబ్రాలు పోస్తున్న అర్చకులు

భీమడోలు: గుండుగొలనులో దేవాదాయ ధర్మశాఖ పరిధిలోని ప్రసిద్ధి గాంచిన పురాతన సీతారామ స్వామి ఆలయంలో శనివారం శాంతి కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయ ఫౌండర్ ట్రస్టీ కొండ గంగరాజ్‌కుమార్ పర్యవేక్షణలో ఆలయ అర్చక స్వామి సుధీరాచార్యులు, యాజ్ఞిక స్వామి గోపాలాచార్యుల బృందం ఆలయంలో శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను విశేషంగా అలంకరించారు. ఆలయంలోని ధృవ మూర్తులకు అభిషేకాలు, ఉత్సవ మూర్తులకు శాంతి కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. తలంబ్రాలు పోసారు. కోవెల ప్రదక్షణాలు చేసారు. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నారాయణపురం కళాశాలలో సంక్రాంతి సంబరాలు

ఉంగుటూరు: నారాయణపురం ఎస్ఎఎస్ ప్రభుత్వ కళాశాలలో సంక్రాంతి సందర్భంగా సంప్రదాయ పోటీలు నిర్వహించారు. భోగిమంటలు వేసి, గాలిపటాలు, స్లో సైక్లింగు తదితర పోటీలు నిర్వహించి విజేతలను ఎంపిక చేశారు. అనంతరం భోగి మంటలు వేసి సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ముగ్గుల పోటీ నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈకార్యక్రమంలో ఎస్‌కే ఆయిషా, గోవా హెప్సిబా, నిర్మల జోయతి, పార్వతి ఉమాశంకర్ భాస్కరరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ కుటుంబానికి పరామర్శ

పెదపాడు: నాయుడుగూడెంలోని మాజీ సర్పంచ్ అక్కినేని సత్యనారాయణ కటుంబ సభ్యులను ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి శనివారం పరామర్శించారు. సత్యనారాయణ ఇటీవల వృద్ధాప్యం కారణంగా మరణించారు. దీంతో అబ్బయ్యచౌదరి శనివారం ఆయన నివాసానికి వెళ్లి సత్యనారాయణ కుమారుడు అక్కినేని సతీష్‌ను పరామర్శించారు. తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈకార్యక్రమంలో జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు ఆళ్ల సతీష్‌చౌదరి, పెదపాడు సొసైటీ అధ్యక్షుడు అక్కినేని రాజశేఖర్, తోటగూడెం ఎంపీటీసీ అక్కినేని గోపీ చంద్ర దుర్గాప్రసాద్, స్థానిక నాయకులు కొత్తూరు విమలారావు పాల్గొన్నారు.

యూటీఎఫ్ ఉద్యమ నేత పోలిశెట్టికి ఘన నివాళి

ఉంగుటూరు: యూటీఎఫ్ ఉద్యమ నిర్మాత ఎస్ఆర్ పోలిశెట్టికి వర్ధంతి సభ ఉంగుటూరు మండలం నారాయణపురం హైస్కూల్లో నిర్వహించారు. యూటీఎఫ్ అధ్యక్ష కార్యదర్శులు రాంబాబు, దాకి జోగినాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో యూటీఎఫ్ ప్రతినిధులు పాల్గొన్నారు. పోలిశెట్టి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.